स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्वल भविष्य Glorious Past-Brighter Future


# పద్మసుందరి వెడ్స్ బాలాజీ

(L.D.)

పొత్తూరి విజయలక్ష్మి

పద్మసుందరికి పెళ్ళీడు వచ్చింది.

పద్మ తండ్రికి మంచి భూ వసతి వుంది. ముగ్గురు మగపిల్లల తరువాత ఒక్కతే ఆడపిల్ల. అల్లారుముద్దుగా పెంచారు.



అందువల్ల ముద్దుగా బొద్దుగా పెరిగి పెద్దదయింది పద్మసుందరి. గారాబం వల్ల చదువు వంటబట్టలేదు. కూతురికి చదువు లేదని తల్లి దండ్రులకు ఏవిధమైన చీకూ చింతా లేదు. ఆ మాటకొస్తే వాళ్ళ అబ్బాయిలవీ అంతంత మాత్రం చదువులే. పొలంలో వ్యవసాయం చేయిస్తూ లక్షణంగా వున్నారు తండ్రికి సాయంగా. ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి.

కోడళ్ళు కూడా పాలకేంద్రానికి పాలుపోయిస్తూ, కోడిగుడ్లు, పిడకలూ అమ్మిస్తూ సంతోషంగా వుంటారు అత్తగారికి సాయంగా.

ఎటొచ్చీ ఈ పద్మసుందరికే ఇటువంటి పన్లంటే అసహ్యం. ఇరవై నాలుగ్గంటలూ టి.వి. ముందే వుంటుంది. తనకి వేల్టికి అన్నీ అందించకపోతే అందరి మీదా విరుచుకు పడుతుంది. చిన్నతనం అంతా ఆడింది ఆటగా పాడింది పాటగా సాగిపోయింది.

పెళ్ళిమాట వచ్చేసరికి గొంతు పట్టుకుంది.

తమ వంటి భూస్వాముల పిల్లలున్నారు. వాళ్ళ ఇంటికి

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
गौरवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

పంపితే పనీ పాటా చెయ్యాలి. పద్మకి చాతకాదు. అదీగాక పట్నంలో ఉండే పిల్లాడిని చూడమని సరదాపడింది పద్మ.

పట్నంలో అబ్బాయిలని చూస్తే అంతంత చదువులూ, పెద్ద ఉద్యోగాలూ, వాళ్ళకు చదువుకుని ఉద్యోగం చేసే పిల్లలు కావాలి.

ఆస్తి చూసి చదువురాని ఆడపిల్లని పెళ్ళిచేసుకునే రోజులు పోయాయి.

ఏం చేసుకుంటాం ఆ ఆస్తి? ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటే ఆస్తి అదే వస్తుంది అంటున్నారు అందరూ.

ఏ చిన్న ఉద్యోగమో చేసుకునే వాడు దొరకచ్చు. వాళ్ళు వీళ్ళ స్థాయికి తూగరు. తక్కువ వాడికి పిల్లనెట్లా ఇస్తారు? తెలిసిన వాళ్ళకి చెప్పారు. అక్కడా ఇక్కడా వెతికించారు. ఫలితం శూన్యం.

తమకంటే పైమెట్టుగా వుండే వాళ్ళు కావాలి. వాళ్ళకి పద్మ నచ్చాలి. చివరికి ఒక శ్రేయోభిలాషి, "ఈ మారుమూల పల్లెటూళ్ళో కూర్చుని వెతికితే లాభం లేదు. లక్షణంగా హైదరాబాద్ వెళ్ళండి. అక్కడ కావలసినన్ని మేరేజ్ బ్యూరోలు. వాటిల్లో కుప్పలకొద్దీ సంబంధాలు. ఓ నాలుగింటిలో రిజిస్టర్ చేయించుకుంటే వాళ్ళే వివరాలు ఇస్తారు. తగిన సంబంధం దొరుకుతుంది" అని సలహా యిచ్చాడు.

ఇల్లూవాకిలీ కొడుకుకూ, కోడళ్ళకూ అప్పగించి హైదరాబాద్‌లో రెండు పడగ్గదుల ఫ్లాట్ తెలిసినవాళ్ళది అద్దెకి తీసుకుని పద్మని తీసుకుని హైదరాబాద్ వచ్చారు పద్మ తండ్రీ తల్లీ.

ఓ వారం రోజులు ఇంటికి అన్నీ అమర్చుకోవడంతో సరిపోయింది. మంచిరోజు చూసుకుని మేరేజ్ బ్యూరోలకు బయలుదేరారు. ముచ్చటగా మూడింటిలో రిజిస్టర్ చేయించుకుని ఫీజుకట్టి, ఫొటో, వివరాలూ ఇచ్చి ఇంటి కొచ్చారు.

వారం రోజులు తిరిగొచ్చాయి. ఉలుకూ పలుకూ లేదు. ఏవిటని వెళ్ళి అడిగితే "మీరు రిజిస్టర్ చేయించుకున్నంత మాత్రాన మీ ఇంటికొచ్చి పడిపోవు సంబంధాలు. మీరు రోజూ వచ్చి ఫైళ్ళు చూసుకుని వివరాలు రాసుకుని వాళ్ళకు మీరే ఫోన్లు చెయ్యాలి" అన్నారు వాళ్ళు.


ప్రతిరోజూ చద్దెన్నం తిని పొలానికెళ్ళినట్లూ మేరేజి బ్యూరోలకు వెళ్ళి భోజనాల వేళదాకా ఫైళ్ళు తిరగేశారు దంపతులు. పెళ్ళికొడుకులు చాలా మంది వున్నారు. కానీ వాళ్ళందరికీ బాగా చదువుకుని ఉద్యోగం చేసే పిల్లలే కావాలిట.

పిల్ల ఎలా వున్నా చాలు డబ్బుంటే చాలు అన్న పెళ్ళికొడుకొక్కడు కనిపించేడు గానీ ఫొటో చూసి నిరుత్సాహ పడ్డారు. పిల్లవాడు మరీ సన్నగా గాలి కెగిరి పోయేట్లు వున్నాడు. ఈడూజోడూ బొత్తిగా బావుండదు.

నెల్రోజుల పాటు గాలించినా ఏమీ దొరకలేదు.

పేపర్లలోని ప్రకటనలకు సమాధానాలు ఇస్తూ, మరికొన్ని మేరేజి బ్యూరోలను సంప్రదిస్తూ మరో నెలరోజులు గడిచిపోయాయి. దంపతులు దిగాలు పడిపోయారు.

తల్లిదండ్రులు ఇంత హైరానా పడుతున్నారు గానీ పద్మసుందరి మాత్రం నిశ్చింతగా వుంది. ఆ అమ్మాయికి హైదరాబాద్ ఎంతో నచ్చింది. టివిలో బోలెడన్ని ఛానల్స్. ఊర్నిండా సినిమాలు. వింతలూ వినోదాలు. స్వర్గంలా వుంది.




మూడు నెలలు పట్నంలో వున్నా పని జరగలేదు. ఇల్లూ వాకిలీ వదిలేసి ఎన్నాళ్ళుంటాం పై ఊళ్ళో? తిరిగి వెళ్ళిపోదాం. దానికి కళ్యాణ ఘడియ ఇంకా రాలేదేమో అనుకున్నారు తల్లిదండ్రులు.

అయితే పద్మసుందరి మాత్రం, "నేను చచ్చినా ఆ పల్లెటూరికి రాను. విజయమో వీరస్వర్గమో ఇక్కడే. నాకు పెళ్ళిచేసి నన్ను అత్తవారింటికి పంపించి అప్పుడు వెళ్ళండి" అని ఖచ్చితంగా చెప్పేసింది.

తలలు పట్టుకున్నారు తల్లిదండ్రులు.

వాళ్ళ ఎదురు అపార్ట్‌మెంట్లో ఈశ్వరశాస్త్రిగారని ఒక సంగీతం మాస్టరుగారున్నారు. ఆయన భార్య మహాలక్ష్మి. కాస్త అటూ ఇటూగా వీళ్ళ వయసే వుంటుంది వాళ్ళకీ. పరిచయం అయింది. కష్టసుఖాలు చెప్పుకునే స్థాయికి చేరింది వారి పరిచయం.

ఈశ్వరశాస్త్రికి తన సమస్య చెప్పుకున్నాడు ఈయన.

"అమ్మాయి పట్టు బట్టటం మాట అలా వుంచి వచ్చిన పని కాకుండా మళ్ళీ ఊరికి వెళ్ళిపోవడం మీకు మాత్రం ఏం మర్యాదగా వుంటుంది? సింగడు అద్దంకి పోనూ పోయాడు రానూ వచ్చాడు అని నవ్వుకోరూ. సగం దాకా ఈదాక వెనక్కి తిరగడం అవివేకం. ముందుకే ఈదండి. మరింత గట్టిగా ప్రయత్నించండి. లక్షణంగా పిల్ల పెళ్ళిచేసి దర్జాగా వెళ్ళండి" అని ధైర్యం చెప్పాడు ఈశ్వరశాస్త్రి.

అంతేకాదు నేను సాయం చేస్తాను అని హామీ ఇచ్చాడు.

ఈశ్వరశాస్త్రి మాటలతో ధైర్యం వచ్చింది పద్మ తండ్రికి. మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు మొదలెట్టాడు. అలా వెతుకుతూ వుండగా ఓ పెద్దమనిషి కనిపించాడు.

"మీరాపని చెయ్యండి 'మంగళసూత్రం' అని ఒక మేరేజ్ బ్యూరో వుంది. వాళ్ళు చాలా ఘటికులు. ఫీజు ఘనంగానే తీసుకుంటారు గానీ క్రియ కూడా ఘనంగానే వుంటుంది. పధ్నాలుగేళ్ళ పిల్లాడు కానివ్వండి, డెబ్బై ఏళ్ళ వృద్ధుడు కానివ్వండి వాళ్ళ దగ్గరికి వెళ్తే పెళ్ళిచేసి కానీ పంపించరు.

ఫైళ్ళు మన మొహాన పారేసి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోరు. తగిన సంబంధం చూస్తారు. వాళ్ళే జాతకాలు చూస్తారు. వాళ్ళే పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తారు. కుదిరితే వాళ్ళకు కొంత డబ్బివ్వాలి. ఆ తర్వాత మనం కావాలంటే వాళ్ళే పూనుకుని కళ్యాణ

మండపం వగైరా మాట్లాడ్డం, ఈవెంట్ మేనేజర్ని చూట్టం అన్నీ చేసి పెళ్ళి చేయించి పిల్లని పిల్లాడిని గదిలోకి పంపాక అప్పుడు ఊపిరి పీల్చుకుంటారు'' అని నోరూరేలా చెప్పాడు.

వెంటనే ఆటో కట్టించుకుని ఆ మంగళసూత్రం ఆఫీసుకి వెళ్ళారు పద్మ తల్లిదండ్రులు. ఆఫీసెంతో బావుంది. మావిడాకులూ మంగళ వాయిద్యాలూ అంతా పెళ్ళి వాతావరణం.

వీళ్ళు డబ్బు కట్టి రిజిస్టర్ చేయించుకుని దరఖాస్తు పూర్తిచేసి ఫొటో అంటించి ఇచ్చారు. మరికాసేపు ఆగాక వీళ్ళని లోపలికి తీసికెళ్ళారు.

అదో పెద్ద ఏసి గది. గోడలకి వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, కాణిపాకం వినాయకుడూ, కనకదుర్గమ్మ మొదలైన దేవతల ఫొటోలున్నాయి.

పెద్ద బల్ల. దానికటు వైపు కూర్చుని వున్నారు 'మంగళసూత్రం' నిర్వాహకులు.

చూడముచ్చటగా వున్నారు ఆ దంపతులు. అతనిపేరు కళ్యాణరావు. ఆవిడ పేరు మనోహరి.

''రండమ్మా రండి బాబుగారూ! కూర్చోండి'' అని ఆదరంగా ఆహ్వానించారు. కూల్‌డ్రింకులు ఇచ్చి ''చెప్పండి'' అని అడిగారు.

''తమ గురించి వివరాలన్నీ చెప్పి విసిగిపోయాం. మీ గురించి విని కొండంత ఆశతో వచ్చాం. ఇక ఏడుకొండలవాడేం చేస్తాడో'' అన్నాడు దీనంగా పద్మతండ్రి.

చిన్నగా నవ్వాడు కళ్యాణరావు. ''చూశారా ఇంతకు ముందే తిరుపతి నుండీ కళ్యాణం లడ్డూ తెచ్చి ఇచ్చారు ఎవరో. ఇంతలో మీరొచ్చారు. నిజంగా శుభసూచకం. తర్వాత మీరూ ఇటు అమ్మాయి పెళ్ళిచేసి అటుకొండకి వెళ్ళి దేవుడి కళ్యాణం చేయించాలి'' అన్నాడు.

మనోహరి పక్కనే వున్న ప్లాస్టిక్ డబ్బాలోంచి లడ్డు ప్రసాదం తీసి వాళ్ళిద్దరికీ ఇచ్చింది. ఆ పక్కనే మరికొన్ని డబ్బాలున్నాయి. వాటిల్లో పాలకోవా పటిక బెల్లం, విభూతీ కుంకుమా వంటి ఇతర దేవుళ్ళ ప్రసాదాలు కూడా వున్నాయి.

వీళ్ళు ప్రసాదం కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నాక మళ్ళీ పాయింట్‌లోకి వచ్చారు.

''అమ్మాయి బానేవుంటుంది గానీ కాస్త లావు. చదువు ఆట్టేలేదు. పెళ్ళెలా అవుతుందా అని కాస్త దిగులుగా వుంది'' అన్నాడు పిల్ల తండ్రి.

ఫక్కున నవ్వేశాడు కళ్యాణరావు. ''భలేవారేనండీ మీరు. అమ్మాయిని సృష్టించిన ఆ దేవుడు భర్తని సృష్టించి వుండడా? మనం చిత్తశుద్ధితో వెతకాలి అంతే. రేపీపాటికి మీకు అరడజను సంబంధాలు చూపించే బాధ్యత నాది. మీరాపని చెయ్యండి. రేపు అమ్మాయిని వెంటబెట్టుకుని రండి. మేము నేరుగా అమ్మాయితో మాట్లాడితే ఆ అమ్మాయి అభిప్రాయాలూ, అలవాట్లూ తెలుస్తాయి మాకు. అప్పుడు ఆ అమ్మాయి అభిరుచికి తగిన వరుడిని ఎంపిక చెయ్యటం మాకు సుళువు అవుతుంది. పెద్దవాళ్ళం ఏదో మనకు నచ్చిందని గుడ్డిగా పెళ్ళిచేసే రోజులు కావుకదా ఇవి. ఆలోచనలూ అలవాట్లూ కలిస్తే కలకాలం సుఖంగా కాపురం చేసుకుంటారు'' అన్నాడు కళ్యాణరావ్.

అతని వ్యవహార దక్షతకీ, ముందుచూపుకీ ముచ్చట పడిపోయారు వీళ్ళు.

మర్నాడు పద్మసుందరిని వెంటబెట్టుకు వెళ్ళారు. మీరు బయట కూర్చోండి అని వాళ్ళని బయటకు పంపించి పద్మసుందరితో మంచీ చెడ్డా మాట్లాడేరు కళ్యాణరావు దంపతులు.

''మీరు వెళ్ళిరండి. తగిన సంబంధం వెతికి మీకు ఫోన్ చేస్తాం'' అన్నారు.

పద్మసుందరి బాగానే వుంది. కాస్త లావు అయినా పాత తెలుగు సినిమా హీరోయిన్ లాగా కళగా వుంది. ఆస్తి వుంది. కానీ చదువురాదు. సంగీతం డాన్సూవంటివేమీ రావు. కుట్లు అల్లికలూ రావు. పనీపాటా రావు. ఠీవిగా కూర్చుని అందరికీ ఆజ్ఞలు జారీచెయ్యడం దాష్టీకం చెలాయించి అందర్నీ చెదరగొట్టడంలో మాత్రం అందెవేసిన చెయ్యి.

అటువంటి అమ్మాయికి పెళ్ళికావడం అందులోనూ అన్నివిధాలా వాళ్ళకి నచ్చిన వరుడు దొరకడం అంటే మాటలు కాదు. కానీ కళ్యాణరావు కార్యశూరుడు.

న్యూయార్క్‌లో ఉద్యోగం చేసుకునే అబ్బాయికీ, న్యూజెర్సీలో ఉద్యోగం చేసే అమ్మాయికి పెళ్ళిచెయ్యడమో, లేదా బెంగుళూర్లో మల్టీనేషనల్


ACHARYA NAGARJUNA UNIVERSITY

Nagarjuna Nagar, Guntur - 522 510



CENTRE FOR DISTANCE EDUCATION - HYDERABAD

STUDY CENTER CODE - 12

APPLICATIONS ARE INVITED FOR ADMISSION INTO P.G. COURSES

FEE STRUCTURE FOR FIRST YEAR - ACADEMIC YEAR 2006-07

| Sl. No. | COURSE | Total Fee Payable Including Examination Fee | Sl. No. | COURSE | Total Fee |
|---|---|---|---|---|---|
| 1. | **M.Sc.** (Chemistry) | 10,425.00 | 5. | **M.Sc.** (Maths) | 2,430.00 |
| 2. | **M.Sc.** (Physics) | 9,760.00 | 6. | **MBA** | 6,660.00 |
| 3. | **M.Sc.** (Micro Biology) | 10,260.00 | 7. | **M.Com.** | 2,495.00 |
| 4. | **M.Sc.** (Zoology) | 9,760.00 | 8. | **M.S.W** | 6,530.00 |
| | | | 9. | **M.A.** (English) | 2,430.00 |
| | | | 10. | **M.A** (Telugu) | 2,430.00 |

* Application form Rs. 100/- * T.C. is not required

* Fee mode of payment : The Director, CDE, ANU, Nagarjuna Nagar, Guntur

*For further details please contact - Authorised Study Centre*

RRD DEGREE & PG COLLEGE

(Affiliated to Osmania University)

1-9-630/1, Vidyanagar, Hyderabad-500 044. **Cell : 9347852690, Ph. : 27605322**

*COURSES OFFERED* B.Sc. (Physical Sciences) MPC, MPE, MPCs, MSCs, MECs - B.Sc. (Life Sciences) Bt. Mi.C, M.G.C., M.C.C.A - B.Com. Regular & B.Com Computers - M.Sc. Physics & Maths

కంపెనీలో పనిచేసే అమ్మాయికి ఆ ఊళ్ళోనే పని చేసే మల్టీనేషనల్ కంపెనీ ఎంప్లాయిని వెదకటమో అయితే చాలా తేలిక. ఏ సందు చివర వున్న మేరేజి బ్యూరో వాళ్లయినా చేసేస్తారు.

ఎక్కడో మారుమూల పల్లెటూర్లో పుట్టిన ఈ పద్మసుందరికి సంబంధం వెతకడం ఛాలెంజ్. కళ్యాణరావుకి అటువంటి ఛాలెంజ్‌లు అంటే చాలా ఇష్టం.

ఆ రాత్రి కంప్యూటర్ ముందు కూర్చున్నాడు కళ్యాణరావు. అరగంట శ్రమపడి, ఆరేడు సంబంధాలు వెతికి పక్కన పెట్టాడు.

మళ్ళీ వడపోసి బాలాజీ అనే అతనికి మొదటి స్థానం ఇచ్చాడు. జాతకాలు కూడా బాగానే కలిసే సరికి అతనికి మరో సంతోషం వేసింది.

తృప్తిగా నిద్రపోయాడు. తెల్లారి ఆఫీసు తెరవగానే ముందుగా పద్మతండ్రికే ఫోన్ చేశాడు. ''ఆరేడు సంబంధాలున్నాయి. చూసుకుందురుగాని రండి'' అన్నాడు.

ఇంత త్వరగా పిలుపు వచ్చేసరికి కాళ్ళూ చేతులూ ఆడలేదు పద్మతండ్రికి.

ఈశ్వరశాస్త్రి దగ్గరకు పరిగెట్టాడు. వాళ్ళనీ సాయం రమ్మన్నాడు. రెండు ఆటోలు మాట్లాడుకుని మంగళసూత్రం ఆఫీసుకి వెళ్ళారు.

గౌరవంగా ఆహ్వానించాక కళ్యాణరావు దంపతులు, పక్కగదిలోకి వీళ్ళని తీసికెళ్ళి సంబంధాలన్నీ చూపించారు. ''అన్నింట్లోకీ ఈ బాలాజీ అనే కుర్రవాడి సంబంధం అన్నివిధాలా మీకు బావుంటుందనిపిస్తోంది. ఇదుగో ఫైలు చూస్తూ వుండండి'' అని చూపించి వేరే పనిమీద వెళ్ళారు.

ఫైలు తెరిచావు వీళ్ళు. ఫోటోలో పెళ్ళికొడుకు ఒడ్డూ పొడుగూ దిట్టంగా పాత తమిళ సినిమా హీరోలా ఉన్నాడు. రంగు నలుపే. అయినా మొహం బావుంది. ఒంటినిండా నగలు వేసుకుని నవ్వుతూ బాగానే వున్నాడు. కులం గోత్రం వయసూ నక్షత్రం అన్నీ తగినట్లుగానే వున్నాయి.

విద్యకు ఎదురుగా ఒక అడ్డగీత కొట్టి వుంది.

వృత్తి దగ్గర ఎల్.డి అనివుంది.

ఆదాయం దగ్గర లక్షల్లో అని రాసి వుంది.

పద్మ తండ్రి తెల్లమొహం వేశాడు సరే, ఈశ్వరశాస్త్రి, ఇంగ్లీషు కాన్వెంటుకు పాఠాలు చెప్తున్న మహాలక్ష్మి కూడా తెల్ల మొహాలు వేశారు.

ఎల్ డి ఏమిటి? ఎల్‌డిసీనా? అయితే ఆదాయం అంత ఎలా వుంటుంది. అదీ గాక ఆ ఉద్యోగానికి అంతో ఇంతో చదువుండాలి. ఏమిటీ తిరకాసు? వీళ్ళిలా ఆలోచిస్తుండగానే కళ్యాణరావు వచ్చాడు.

''చూశారా ఎలావుందీ సంబంధం?'' అన్నాడు.

''అంతా బాగానే వుందనుకోండి. కానీ వరుడి వృత్తి విషయంలోనే మాకు కించిత్తు సందేహంగా వుంది. ఎల్.డి. అంటే ఏమిటి? అదేమైనా కొత్తరకం ఉద్యోగమా?'' ప్రశ్నించాడు ఈశ్వరశాస్త్రి.

నవ్వేశాడు కళ్యాణరావు. ''ఉద్యోగం కాదండీ'' అన్నాడు.

''మరైతే వ్యాపారమా?'' ఈసారి కాబోయే కన్యాదాత అడిగాడు.

''వ్యాపారమూ కాదు. ఒక వ్యాపకం అంతే!'' అన్నాడు కళ్యాణరావు.

''ఏమిటో అంతా అయోమయంగా వుంది నాయనా. అర్థం కావడం లేదు'' అంది పిల్లతల్లి.

''ఎల్.డీ. అంటే లాండ్ డ్రైవర్ అక్కయ్య గారూ'' చెప్పాడు కళ్యాణరావు.

''బస్సుడ్రైవరు, లారీడ్రైవరు విన్నాంగానీ లాండ్ డ్రైవర్ గురించి ఎక్కడా వినలేదండీ!'' అంది మహాలక్ష్మి.

''వినే అవకాశం లేదులెండి. ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. డెబ్భైలల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనే మాట విన్నామా చెప్పండి. ఇదీ అంతే. కొత్త వృత్తి. వివరంగా చెప్తాను వినండి. ఈ ఊళ్ళో ఈ మధ్యకాలంలో విపరీతంగా పెరిగింది రియల్ ఎస్టేట్. ఏనాడో రాళ్ళల్లో రప్పల్లో పడివున్న స్థలాలకి రెక్కలొచ్చి కోట్లు పలుకుతున్నాయి. వందకి




కొన్న స్థలం కోటి అమ్ముతోందంటే. ఆ స్థలం యజమాని పంట పడినట్లే కదా! కానీ పండిన చేనుకి చీడపీడల బాధ తప్పదు. ఇక్కడా అంతే. అప్పుడు తెలివిగా కొనలేక, ఇప్పుడు కొనే శక్తిలేక ఎదుటివాడు బాగుపడుతున్నాడనే వుండిపోయిన వాళ్ళు మంటతో ఆక్రమణలు చేస్తున్నారు. అసలు యజమానులు కట్టిన కంచెలూ పెట్టిన బోర్డులూ పీకేసి అవతల పారేసి ఇదంతా మాదే అని దబాయిస్తున్నారు. గట్టిగా అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారు.

అదృష్టం అందినట్లే అంది చెయ్యిజారే పరిస్థితి వచ్చేసరికి స్థలాల యజమానుల గుండెలు ఠారుమంటున్నాయి. పోలీసులూ, చట్టాలూ వున్నా అవి నామమాత్రమే. వాటివల్ల బాధితులకు ఎటువంటి ప్రయోజనమూ లేదు.

సమాజంలో జరిగే మార్పులకు అనుగుణంగా అనేకమంది లాభం పొందుతారు. పిండివంటలు వండడానికి గృహిణులు బద్ధకిస్తుంటే స్వగృహ ఫుడ్స్ వచ్చినట్లే, మంత్రాలు చదివే బ్రాహ్మలకు డిమాండ్ పెరిగేసరికి పూజల కేసెట్లు వచ్చినట్లే ఆక్రమణదారులకు విరుగుడుగా ఈ లాండ్‌డ్రైవర్లు రంగంలోకి దిగుతున్నారు.

వీళ్ళకేం చదువులూ, ట్రైనింగ్‌లూ అక్కర్లేదు. యజమాన్లమీద దౌర్జన్యం చేసే ఆక్రమణ దారుల మీద వీళ్ళు దౌర్జన్యం చేసి వెళ్ళగొట్టాలి అంతే. అందుకు తగిన బలం బలగం వుంటే చాలు.

వీళ్ళ శ్రమకు ఫలితం కూడా ఘనంగానే వుంటుంది.

అదెలా అంటారేమో. ఒక స్థలం విలువ కోటి రూపాయలు అనుకోండి. ఎవరో దాన్ని ఆక్రమించుకుని ఇటొస్తే కాళ్ళు విరగ్గొడతాం అన్నారనుకోండి. ఆ యజమాని ఈ లాండ్ డ్రైవర్‌ని ఆశ్రయిస్తాడు.

ఇతను బేరాలు ఆడతాడు. స్థలం ఖాళీ చేయిస్తాను నాకో ముప్ఫై లక్షలు ఇవ్వు అంటాడు.

కోటి రూపాయల స్థలం పోగొట్టుకునే బదులు ముప్ఫై ఇచ్చి మిగిలిన డెబ్బై లక్షలూ మిగుల్చుకోవడం యజమానికి సంబరంగా వుంటుంది. ఆ స్థలం అతను ఏ పదివేలకో కొన్నదే అయివుంటుంది. అందుకే సరే అంటాడు.

లాండ్ డ్రైవర్ రంగంలోకి దిగుతాడు. ఆ స్థలం ఆక్రమించుకున్న వారిని కాళ్ళు తలకాయలూ విరగ్గొట్టి వెళ్ళగొట్టి కొన్నాళ్ళు తను కాపలా కాయిస్తాడు.

తనను మించిన వాడు రంగంలోకి దిగేసరికి తోకముడవక తప్పదు ఆ ఆక్రమణ దారుకి.

యజమాని దగ్గర డబ్బు తీసుకుని లాండ్ డ్రైవర్ మరోపని చూసుకుంటాడు'' వివరంగా చెప్పాడు కళ్యాణరావు.

వింటున్న శ్రోతలకి చెమటలు పోశాయ్.

''పెళ్లికొడుకు గూండానా కళ్యాణరావుగారూ? ప్రమాదం కాదూ. ఈ తగవులాటలూ తన్నులాటలూ ధర్మమేనంటారా?'' అడిగాడు ఈశ్వరశాస్త్రి.

గంభీరంగా నవ్వేడు కళ్యాణరావు. ''అవన్నీ మన ఆలోచన బట్టి వుంటుంది. అయ్యో మద్యం అమ్మి అందరి ఆరోగ్యం నాశనంచెయ్యడం అన్యాయం అనుంటే బార్లూ వైన్ షాపులూ వుంటాయా?

జీవహింస పాపం అని మాంసం అమ్మేవాడు కొట్టు కట్టేస్తే మటన్ బిర్యానీ తినేవాళ్ళంతా ఏ గంగలో దూకాలి?

అవన్నీ పక్కన పెట్టి ఇదీ ఒక వృత్తి అనుకోండి. అప్పుడు నిజం మీకే అర్థమవుతుంది.

నాయుడుగారు వ్యవసాయం చేసినా, మీరు సంగీతం చెప్పినా, నేను పెళ్ళి సంబంధాలు చూసినా అన్నీ పొట్టకోసమే. ఇక ఈ బాలాజీ తండ్రి సైకిల్ తొక్కుతూ పాలుపోసేవాడు. చిన్నతనం నించీ ఆకతాయిలా తిరిగిన బాలాజీకి ఆ అల్లరే కలిసి వచ్చింది.

ఇప్పుడు బాలాజీకి ఊరిబయట పెద్ద మేడ వుంది. కారు జీపు వున్నాయి. మందీ మార్బలం వున్నారు. బాలాజీకి ముగ్గురు అక్కచెల్లెళ్ళు. వాళ్ళకి ఇతనే పెళ్ళిళ్ళు చేశాడు. ఆ బావలని కూడా తనదగ్గరే పెట్టుకున్నాడు. చూస్తుండగానే వామనమూర్తిగా ఎదిగిపోయాడు'' చెప్పాడు కళ్యాణరావు.

''కానీ ఈ దౌర్జన్యం ఎంతకాలం సాగుతుందంటారు? పరిస్థితి బెడిసికొడితే మా పిల్లజీవితం ఏంకావాలి?'' అని అడిగింది మహాలక్ష్మి.

నవ్వేశాడు కళ్యాణరావు. ''గతంలో అయితే మనుషులు తాము వుండడానికి మాత్రమే ఇల్లుకావాలనుకునే వారు. ఓ స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకుని మొక్కా మోడీ వేసుకుని కాపురం వుండేవాళ్ళు. తర్వాత పరిస్థితులు మారేయి. మనం ఒకవైపు వుంటూ మరోభాగం అద్దెకిస్తే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడు అన్నట్లు వుంటుంది అని అద్దెకివ్వడానికి భాగం కట్టేవాళ్ళు. ఆ తర్వాత రేపెలా వుంటుందో పిల్లాడికోసం ఓ ఇల్లు కట్టి పడేస్తే పడుంటుంది అని కొడుకుకోసం, ఇక మిగిలింది కూతురేగా అని దానికోసం ఇళ్ళు కట్టించడం మొదలయింది.

అటు బ్యాంక్ వడ్డీలు తరిగిపోతున్నాయి. ఇటు ఏదోవిధంగా సంపాదనలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓ స్థలం కొని పడేస్తే పడుంటుంది అని విచ్చల విడిగా స్థలాలు కొనడం ప్రారంభం అయింది. వేలం వెర్రి. ప్రతివాడూ ఊరిమధ్యలో ఒకటి, ఊరికి అటువైపు ఒకటీ ఇటువైపు ఒకటీ కొని పడేసే వాడే.

దిక్కూ దివాణం లేకుండా స్థలాలు పడి వున్నంత కాలం ఆక్రమణలు తప్పవు. ఆక్రమణలున్నంత కాలం బాలాజీ వంటి ఎల్.డీల పని మూడు పువ్వులూ ఆరుకాయలూ.

ఇదంతా జరక్కుండా వుండాలంటే మనుషుల్లో దురాశ పోవాలి. నాకున్నది చాలు అని తృప్తిపడే గుణం రావాలి. ఇవన్నీ రావాలంటే మళ్ళీ సత్య కాలం రావాలి'' అంటూ ముగించాడు కళ్యాణరావు.

వింటున్న వాళ్ళు నవ్వేశారు.

''ఇది మంచి సంబంధం. అన్నివిధాలా మీకు తగినది అని నాకు అనిపించింది. మీరూ ఆలోచించుకోండి. మీవాళ్ళను అడగండి. నిదానంగా ఆలోచించుకుని మీకు నచ్చితేనే ముందుకి వెళ్దాం. లేదూ మరొకటి చూసుకుందాం'' అన్నాడు కళ్యాణరావు.

వేడెక్కిన బుర్రలతో ఇంటికొచ్చారు నలుగురూ. ముందు వద్దులే బాబూ అనుకున్నారు. కానీ తర్వాత బానే వుందేమో అనిపించింది.

''ఏదైనా కాలానుగుణంగా పోవాలి నాయుడు గారూ. నా విషయమే చూడండి. మా తండ్రిగారు వేదపండితులు. మేము నలుగురు అక్క చెల్లెళ్లం. నేను రెండోదాన్ని. మా అక్కయ్యను ఒక వేద పండితుడి ఇంట్లో ఇచ్చారు. నన్ను ఈ సంగీత పండితుడికి ఇచ్చారు. ఆ తరువాత నాన్నగారు పోయారు. మగదక్షత లేని ఇల్లు. అంతంత మాత్రం ఆర్థిక స్థితి.




జరుగుబాటు కాక పెద్ద చెల్లెలిని ఒక కానిస్టేబుల్‌కీ, రెండో చెల్లెలిని గవర్నమెంటు ఆఫీసులో చిన్న గుమాస్తాకీ ఇచ్చి చేశారు. జీతాలు తక్కువైనా పై సంపాదనలుంటాయి అని అప్పట్లో చెవులు కొరుక్కునే వాళ్లు. ఛ ఛ లంచగొండి వాళ్ళను తెచ్చారా వెతికి అని బాధపడ్డారు మా తాతగారు.

ఏమైంది చెప్పండి? మా అక్క సంసారం గోచీకి ఎక్కువ, అంగ వస్త్రానికి తక్కువగా వుంటుంది. ఇక నా సంగతంటారా నిజం చెప్పాలంటే నేనూ ఏదో ఉద్యోగం వుండబట్టి గుట్టుగా గడుపుకొస్తున్నాం. ఈయన సరళీ స్వరాలనూ స్వరజతులనూ నమ్ముకుంటే రోడ్డున పడేవాళ్ళం.

మా చెల్లెళ్ళిద్దరూ వేసీ వేయకుండా వున్నారు. పెద్దమరిది ట్రాఫిక్‌లో వుంటాడు. చిన్నమరిది సంగతి చెప్పనే అక్కర్లేదు.

గిల్టునగలు పెట్టుకుని అసలు నగలు అని గొప్పలు చెప్పుకునే స్థితినించి బంగారం నగలు పెట్టుకుని గిల్టునగలని గుట్టుగా చెప్పేస్థితికి ఎగబాకారు మా చెల్లెళ్ళు.

కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందన్నట్లు వాళ్ళిద్దరూ సాయం చెయ్యబట్టి నేనూ మా అక్కయ్యా మా పిల్లల పెళ్ళీ పేరంటం చెయ్యగలిగాం.

ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే ధైర్యం చేసి బాలాజీకి ఇవ్వడమే మంచిది. ఈ పరిస్థితులని బట్టి చూస్తే బాగా వృద్ధిలోకి వస్తాడు.

లేదూ బెడిసికొట్టినా ఇప్పటికి అతనికి వున్నదీ మీ పద్మకి మీరిచ్చే ఆస్తీ జోడైతే వాళ్ళ పైతరం కూడా గడిచిపోతుంది'' అని స్వానుభవం జోడించి సలహా చెప్పింది మహాలక్ష్మి.

అనేక తర్జన భర్జనల అనంతరం సరే అనుకున్నారు.

మంగళసూత్రం ఆఫీసులో పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాడు కళ్యాణరావు. వాళ్ళ కుటుంబం వీళ్ళ కుటుంబం బిలబిల్లాడుతూ వచ్చారు. అందరికీ సమ్మతమే అయింది.

పీచులాగా లేకుండా నాకు తగినట్లున్నాడు అనుకుంది పద్మ.

ప్రతిదానికీ బెదిరిపోయే రకం కాదు. ఎదుటివాడిని బెదరగొట్టే రకం. ఆ దాష్టీకం చూసి ముచ్చటపడ్డాడు బాలాజీ.

ఇది ఇట్లావుండి పెత్తనం చేస్తుంటే నేను నిశ్చింతంగా బయటపన్లు చేసుకుంటాను అనుకున్నాడు బాలాజీ.

పద్మ పేరున ఎకరా నాలుగు లక్షలు చేసే పదెకరాల పొలం, రెండు లక్షల బంగారం వున్నాయి. యాభై లక్షలు కట్నం ఇచ్చి పెళ్ళి ఘనంగా చెయ్యమన్నాడు బాలాజీ. నాయుడుగారికది ఓ లెక్కలోకి రాదు. అదనంగా మరో మూడు లక్షలు ఆడపడుచు కట్నం కూడా ఇస్తానన్నాడు.

అక్కడే నిశ్చయతాంబూలాలు కూడా పుచ్చేసుకున్నారు.

కళ్యాణరావుకే పెళ్లిబాధ్యత అప్పగించేశారు.

వారికి మాట రానివ్వకుండా ఘనంగా ఏర్పాట్లు చేయించాడు కళ్యాణరావు. పద్మ ఊరినించీ బోలెడుమంది పెళ్ళికొచ్చారు. ఈ హడావిడీ అట్టహాసం చూసి మా నాయుడుగారు గట్టివాడే అని ఆనందించారు.

ఇక పెళ్ళికొడుకు వైపున చాలామంది పెద్దవాళ్ళు వచ్చారు. ఒకరిద్దరు సినిమావాళ్ళూ వచ్చారు.

తుపాకీలు పుచ్చుకున్న సెక్యూరిటీ వాళ్ళు వెంట రాగా ఖద్దరు కట్టుకున్న వాళ్ళైతే చాలామందే వచ్చారు!!

ఆ వైభోగం చూసి నా అల్లుడు ఘట్టికుడే అని మురిసిపోయాడు కన్యాదాత.

వివాహ వేడుకలన్నీ ముగిశాయి.

అన్నమాట ప్రకారం అద్దె ఇంటినించే భర్త ఇంటికి వెళ్ళింది పద్మసుందరి.

నేను అదృష్టవంతుడిని. నా కొడుకులు బంగారం పండిస్తారు. నా అల్లుడు దర్జాగా లాండ్ డ్రైవరు. అనుకుంటూ తృప్తిగా ఊరికి వెళ్ళాడు పద్మ తండ్రి!

మా ప్రియతమ కస్టమర్లకు, మార్కెటింగ్ సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

WORK IN TOWARDS DREAMS OF YOUR LIFE...

BVR PROJECTS PVT. LTD.

THE POWER OF INVESTMENT

♦ BUILDERS ♦DEVELOPERS ♦RESORTS ♦FORM HOUSES ♦ INDEPENDENT BUNGALOWS PROJECT

EMAIL : INFO@BVRPROJECTS.COM